రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాలలో ఇస్కాన్ భోజన పాత్రలను మోసుకెళుతున్న విద్యార్థులు, జీపాళెం పాఠశాల ఆవరణలో కోతులు, బూట్లు ఇవ్వలేదంటున్న వరదయ్యపాళెం ఎస్సీ హాస్టల్ విద్యార్థులు







నాడు దేదీప్యం.. నేడు దయనీయం



వరదయ్యపాళెంలోని గోవర్ధనపురం హైస్కూల్‌లో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం

'సమాజం.. ఓ కుటుంబంలో మార్పు రావాలంటే చదువొక్కటే మార్గమని నమ్మి అప్పటివరకు మూసధోరణిలో అంపశయ్యపై నడుస్తున్న ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలను మార్చాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యావిధానాన్ని పేద విద్యార్థులకు చేరువ చేసేందుకు ప్రభుత్వ స్కూళ్లలో ఐఎఫ్‌పీ ప్యానెల్స్, ట్యాబ్‌లు, ఐబీ కరికులం వంటి సదుపాయాలెన్నో పిల్లలకు అందించి వారి అభ్యసనా అభిరుచిని రెట్టింపు చేశారు.

- శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇదీ పరిస్థితి..
- ఎక్కడి పనులు అక్కడే ఆగిన వైనం
- సక్రమంగా అమలు కాని మధ్యాహ్న భోజనం మెనూ
- అరకొరగా విద్యాకానుక పంపిణీ
- వేధిస్తున్న టీచర్ల కొరత.. ఏకోపాధ్యాయ స్కూళ్లలో నామమాత్రపు బోధన
- విద్యాకానుకలో నేటికీ అందని బూట్లు

రేణిగుంట: గత ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలకు తలదన్నే రీతిలో 'నాడు–నేడు' పథకాన్ని తీసుకొచ్చి అధునాతన వసతులను కల్పించారు. అయితే ఇదంతా గతం... ప్రస్తుతం ఆ పనులన్నీ ఆగిపోయాయి. నాడు–నేడుకు నిధులు విదల్చకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. అమ్మలకు ఆదరువుగా నిలిచిన అమ్మఒడి కనుమరుగై తమ పిల్లల బడి ఫీజుల కోసం నేలచూపులు చూస్తున్నారు. పేద విద్యార్థులు మళ్లీ సమస్యల చట్రంలో ఇరుక్కునే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఆగిన పనులు

నియోజకవర్గంలోని రేణిగుంట మండలంలో పలు పాఠశాలల స్థితిగతులు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును సాక్షి క్షేత్రస్థాయిలో పరిశీలించింది. మండలంలోని ఎస్ఎన్‌పురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో నాడు–నేడు పనులు అర్ధాంతరంగా ఆగి ఉన్నాయి. మధ్యాహ్న భోజన తయారీ వంటగది, ప్రహరీగోడ నిర్మాణ పనులు ఆగి ఉన్నాయి. విద్యార్థులకు భోజనం, ఆకుకూర, కోడిగుడ్డు పెట్టారు. మొత్తం 31 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాల ముందు తిరుపతి ఇస్కాన్ టెంపుల్ నుంచి వచ్చిన భోజన పాత్రలను విద్యార్థులే స్కూల్‌లోకి మోసుకెళ్తూ కనిపించారు. మండలంలో చాలా స్కూళ్లకు ఇస్కాన్ నుంచే భోజనం సరఫరా అవుతోంది. నాణ్యత అంతంతమాత్రంగా ఉండడంతో విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారియర్లు తెచ్చుకుని తింటున్నారు.

పూర్తి కాని తరగతి గదులు..

రేణిగుంట మండలంలోని గాజులమండ్యం హైస్కూల్‌లో అదనపు తరగతి భవన నిర్మాణం పూర్తి కాలేదు. పాఠశాలలో పెడుతున్న అన్నం నాణ్యత కొరవడడంతో 10 శాతం మంది విద్యార్థులు ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకుని తింటూ కనిపించారు. నల్లపాళెం ప్రాథమిక పాఠశాల ఏకోపాధ్యాయ పాఠశాల. ఇక్కడ 8 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వారికి టీచర్ కవిత పాఠ్యాంశాలు బోధిస్తోంది. మండలంలోని జీపాళెం ప్రాథమిక పాఠశాలలో 11 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల ఆవరణలో కోతుల బెడద ఎక్కువగా ఉండడంతో పాఠశాల తలుపులు మూసి చదువులు సాగిస్తున్నారు.

బేషుగ్గా కుర్రకాల్వ పాఠశాల..

రేణిగుంట మండలంలోని కుర్రకాల్వ పాఠశాలలో మొత్తం 41 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ ఒక హెచ్ఎం, మరో ఉపాధ్యాయురాలు పని చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పథకం కింద సుమారు రూ.11 లక్షలు ఖర్చు చేసి మౌలిక వసతులను కల్పించారు. విద్యార్థులు ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌లో వీడియో పాఠాలను నేర్చుకుంటూ కనిపించారు. మోడల్ క్లాస్ రూము కూడా ఉంది. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయి.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఉపాధ్యాయ ఖాళీలు:

1. శ్రీకాళహస్తి	-	58
2. రేణిగుంట	-	21
3. ఏర్పేడు	-	03
4. తొట్టంబేడు	-	30
మొత్తం	-	112

సత్యవేడు నియోజకవర్గంలో పాఠశాలల వివరాలు..

మండలం	ప్రభుత్వ స్కూళ్లు	విద్యార్థుల సంఖ్య
నారాయణవనం	48	3382
వరదయ్యపాళెం	69	3863
బీఎన్‌కండ్రిగ	60	3232
సత్యవేడు	64	5695
పిచ్చాటూరు	39	2870
నాగలాపురం	40	3342
కేవీబీపురం	74	5300

విద్యార్థులకు అరకొర ఆహారం

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సర్కారు పాఠశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గత ప్రభుత్వంలో విద్యావ్యవస్థ ప్రారంభంలోనే విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందజేయాల్సినవన్నీ సకాలంలో అందేవి. అంతేకాక మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పిల్లలకు వడ్డించేవారు. అయితే కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన సంస్కరణలు విద్యావ్యవస్థలో పలు విమర్శలకు దారి తీస్తున్నాయి. ఆ మేరకు మధ్యాహ్న భోజనం మిథ్యగా మారింది. విద్యార్థులు ఇంటి నుంచే క్యారియర్లు తెచ్చుకుని తింటున్నారు. విద్యార్థులకు ఎంతో కీలకమైన మధ్యాహ్న భోజనం పట్ల ఇంత నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



నాగలాపురం: ప్రాథమిక పాఠశాలలో ఇంటి నుంచే తెచ్చుకున్న ఆహారం తింటున్న విద్యార్థులు

ఏకోపాధ్యాయుడు ఉండే స్కూళ్లలో..

సత్యవేడు నియోజకవర్గంలో 394 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. అందులో 27689 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో 150కి పైగా పాఠశాలల్లో ఏకోపాధ్యాయుడితోనే నెట్టుకొస్తున్నారు. దీంతో 30 నుంచి 50 మధ్యలో పిల్లలు ఉన్న పాఠశాలల్లో నామమాత్రపు విద్యాబోధన అందుతోంది. దీని కారణంగా పలువురు విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల బాట పడుతున్నారు.

విద్యాకానుకలో అందని బూట్లు..

ఈ విద్యా సంవత్సరం పాఠశాలలు ప్రారంభమై 50 రోజులు పూర్తి కావొస్తున్నా నేటి వరకు పూర్తి స్థాయిలో విద్యా కానుక పంపిణీ కాలేదు. పలుచోట్ల పదో తరగతి విద్యార్థులకు బూట్లు పంపిణీ చేయలేదు. ప్రధానంగా కొలతల్లో తేడా వచ్చిన విద్యార్థులకు ఇప్పటి దాకా బూట్లు అందించలేదనే మాటలు వినిపిస్తున్నాయి.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మొత్తం పాఠశాలల వివరాలు:

మండలం	ప్రైమరీ, యూపీ స్కూళ్లు	హైస్కూళ్లు	విద్యార్థుల సంఖ్య
శ్రీకాళహస్తి(టౌన్, రూరల్)	98	15	10,674
రేణిగుంట	55	11	5,392
ఏర్పేడు	69	12	4,570
తొట్టంబేడు	64	10	3,208
మొత్తం	286	48	23,844

క్లుప్తంగా

అంతర పంటగా మిరప సాగు



నిమ్మ తోటలో అంతర పంటగా సాగు చేసిన మిరప

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలో రైతులు నిమ్మ పంటలో మిరపను అంతర పంటగా సాగు చేస్తున్నారు. 11 ఎకరాల నిమ్మ పంటలో అంతర పంటగా మిరప పంటను వేశారు. నిమ్మ పంటకు వాడే నీటితోనే మిరప పంటను కాపాడుకోవచ్చని, నీటి ఖర్చు తగ్గుతుందని, రెండు పంటలను పండించుకోవచ్చని రైతులు చెబుతున్నారు. మార్కెట్‌లో మిరప పంటకు మంచి డిమాండ్ ఉండడంతో ఎకరాకు అన్ని ఖర్చులు పోను రూ.40 వేలు మిగులుతుందని రైతులు అంటున్నారు.

అట్టహాసంగా గ్రామోత్సవం



సప్రవాహన ఊరేగింపులో శ్రీకృష్ణుడు

నారాయణవనం: నారాయణవనంలోని ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాల లో భాగంగా ఆదివారం సాయంత్రం కృష్ణ భగవానుడు ఉభయదేవేరులు, పాండవుల సమేతంగా సప్రవాహనం అధిరోహించి ఊరేగింపు లో పాల్గొన్నారు. డప్పు వాయిద్యాలు, కోలాటాల మధ్య కొనసాగిన ఊరేగింపులో మహిళలు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్థానిక ధర్మరాజుల ఆలయం వద్ద రుక్మిణీ, సత్యభామ సమేతుడైన శ్రీకృష్ణుడు సప్రవాహనం అధిరోహించారు. నారాయణవనం, ఎరికబట్టు వీధుల్లో విహరిస్తూ రాత్రి 7 గంటలకు ఆలయానికి చేరుకున్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీరోడ్డులో వెలసిన అంకాళమ్మ ఆలయం వద్ద ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఆదివారం వచ్చే అమావాస్య నాడు భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రావు, యశ్వంత్‌రావు, ఉమేష్‌రావు, క్రాంతికుమార్, డాక్టర్ కృపానిధి, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, సావిత్రిబాయి, మాధవ, సాయి, సుశీల, బాబు, వినీత్‌రెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సహాయమంత్రికి ముక్కంటి ప్రసాదాలు

శ్రీకాళహస్తి: కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు పరిశ్రమ శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప ఆదివారం కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల శ్రీవారి పర్యటనకు విచ్చేసిన కేంద్ర సహాయమంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి ముక్కంటి శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

బాలికల హాస్టల్‌లో పారిశుద్ధ్య పనులు



హాస్టల్‌లో పరిసరాలను శుభ్రం చేయిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం చెన్నై రోడ్డులో గల ధర్మరాజులస్వామి ఆలయ సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలికల వసతిగృహంలో ఆదివారం పంచాయతీ కార్యదర్శి అంకయ్య, సర్పంచ్ సుబ్బయ్య ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేయించారు. కాలువల్లో పూడిక తీత, చెత్తాచెదారం తొలగించే పనులు చేపట్టారు.

తాలిక్కల్ వెంకటేశ్వర్లుకు మరో అవార్డు

శ్రీకాళహస్తి: యువసమాజ్ నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ఖాతాలో మరో అవార్డు చేరింది. శ్రీకాళహస్తి యువతరం సేవాసమితి పదేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఆదివారం వసుధైక కుటుంబం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉన్న స్వచ్ఛంద సంస్థ సేవకులకు వారి సేవలకు గుర్తింపుగా సేవాపురస్కారం అవార్డును అందజేశారు. అవార్డును శ్రీకాళహస్తి పురపాలకసంఘ కమిషనర్ రమేష్‌బాబు చేతుల మీదుగా తాళిక్కల్ వెంకటేశ్వర్లుకు అందజేశారు.

స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు అవార్డులు

ఏర్పేడు: మండలంలోని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ఆదివారం సేవా పురస్కార అవార్డులు లభించాయి. యువసమాజ్ నిర్మాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్ రెడ్డి తమ సంస్థల ద్వారా చేసిన వివిధ సేవా కార్యక్రమాలను గుర్తించి యువతరం సేవా సమితి ద్వారా సేవా పురస్కార అవార్డులు ప్రదానం చేశారు. ఆదివారం శ్రీకాళహస్తిలో వారిని శాలువలతో సన్మానించి జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వర్లుకు జ్ఞాపికను అందజేస్తున్న రమేష్‌బాబు

ముక్కంటి సేవలో కేంద్రసహాయ మంత్రి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం కేంద్రపరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.



ముక్కంటి ఆలయం వద్ద కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

సేవ మార్గదర్శకంగా ఉండాలి





రక్తదానం చేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: యువతరం సేవాసమితి ప్రారంభించి 10 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఆదివారం పదో వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పలువురు పెద్దఎత్తున రక్తదానం చేశారు. అలాగే రాష్ట్రంలోని నలుమూలల ఉన్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు హాజరై సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ కమిషనర్ మాట్లాడుతూ మనం చేసే సేవలు ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. రక్తదాతలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రముఖులు, సంస్థ సభ్యులుతదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1989–90 విద్యాసంవత్సరంలో విద్యను అభ్యసించిన 10వ తరగతి విద్యార్థుల ఆదివారం అపూర్వ సమ్మేళనం జరిగింది. ప్రతి స్నేహితుల దినోత్సవం రోజున వీరు కలుసుకుంటున్నారు. అందులో భాగంగా వారు పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

అమర ఆస్పత్రితో ఒప్పందం



అమర ఆస్పత్రిలో ఎంఓయూ పత్రాలను చూపుతున్న యాజమాన్య ప్రతినిధులు

రేణిగుంట: తిరుపతి అమర హాస్పిటల్–బేలారస్ గోమెల్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీ వైద్య రంగంలో విద్యా, సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించడానికి ఆదివారం రేణిగుంట మండలం కరకంబాడి ఆవరణలోని అమర హాస్పిటల్‌లో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రెండు సంస్థల మధ్య క్లినికల్ అబ్జర్వర్‌షిప్, శిక్షణ కార్యక్రమాలు, పరిశోధన సహకారాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుని ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు అమర ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ ప్రసాద్ గొరినేని, గోమెల్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ కరామీ యాండ్రీ స్పష్టం చేశారు. డీన్ డాక్టర్ కరామి ఆండ్రీ మాట్లాడుతూ భారతదేశంలోని ప్రఖ్యాత సంస్థ అమర హాస్పిటల్‌తో భాగస్వామ్యం కావడం తమకు ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అమర హాస్పిటల్ సీఏఓ వేణుగోపాల్, డీఎంహెచ్ఓ శ్రీహరి, మెడికో అబ్రాడ్ చైర్మన్ రాజారామ్, పేరెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరకిరణ్, వైస్ ప్రెసిడెంట్ ప్రియవర్ధన బాబు, ట్రెజరర్ హేమా ద్రి, రాధ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

పసుపు అలంకరణలో చెల్లాతమ్మ

నాగలాపురం: గ్రామ దేవత చెల్లాతమ్మ ఆలయంలో తమిళ ఆడినెల మూడవ ఆదివారాన్ని పురస్కరించుకుని చెల్లాతమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు, మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కును చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు జానకిరామ్ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారిని పసుపు అలంకరణలో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

పరశురామేశ్వరస్వామి ఆలయంలో పూజలు



ఆలయం వద్ద ఆర్‌వీకుమార్ దంపతులు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) డైరెక్టర్, వైస్ చాన్సలర్ ఆర్‌వీ కుమార్ దంపతులు పూజలు చేశారు. ఆలయ పూజారి వారిని పూలమాలలు, శాలువలతో సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్విమ్స్ పీఆర్వో రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో చెంగాళమ్మ



ప్రత్యేకంగా వేసిన ముగ్గు



అంబలి పంపిణీ చేస్తున్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలోని శ్రీచెంగాళమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఆదివారం అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు వేసిన శ్రీ చెంగాళమ్మ దేవత ముగ్గు ఆకట్టుకుంది. అనంతరం ఆలయంలోని శ్రీసుబ్రమణ్యం స్వామి, శ్రీవినాయకస్వామి విగ్రహాలను, నవగ్రహాలను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి, అంబులి తీసుకొచ్చి భక్తులకు పంపిణీ చేశారు. శ్రీ చెంగాళమ్మ దేవత ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. భక్తులు ఎదురు పొంగళ్లు పెట్టారు. కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు





ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి, వీరరాఘవస్వామి ఆలయంలో సామూహిక అర్చనలో భక్తులు

నారాయణవనం: మండలంలో పలు ఆలయాల్లో ఆదివారం అమావాస్య పూజలు నిర్వహించారు. తమిళ ఆడి నెల అమావాస్య కావడంతో తమిళులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. దీనికితోడు అమావాస్య ఆదివారం రావడంతో ఇళ్లవద్ద, వాణిజ్య సముదాయాల వద్ద గుమ్మడికాయ, కొబ్బరికాయలు కొట్టి దిష్టి తీసుకున్నారు. స్థానిక సొరకాయల స్వామి ఆలయంలో ఉదయం మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి, సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలను వితరణ చేశారు. తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాలను అందుకున్నారు. అలాగే వీరరాఘవస్వామి దేవస్థానంలో మధ్యాహ్నం జరిగిన అమావాస్య పూజల్లో మహిళలు, భక్తులు సామూహిక అర్చన పూజల్లో పాల్గొన్నారు. ఆలయాన్ని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాలను పంపిణీ చేశారు. కైలాసనాథకోనలోని శివశక్తి, శాంతి ఆశ్రమాలలో అమావాస్య పూజలను నిర్వహించారు. కైలాసనాథకోనకు వచ్చిన భక్తులు, పర్యాటకులు ఆశ్రమాలలో జరిగిన అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్నారు.

పాపానాయుడుపేటలో ఉచిత వైద్య శిబిరం



శిబిరానికి విచ్చేసిన రోగులతో వైద్యసిబ్బంది

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్), తిరుపతి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో పాపానాయుడుపేట, మర్రిమంద, పెన్నగడం, పెనుమల్లం తదితర గ్రామాల నుంచి వచ్చిన 150 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, డాక్టర్లు సంధ్యారాణి, ప్రభంజన్, తిరుపతి రోటరీ క్లబ్ ప్రతినిధులు రవి, రాజేష్, చలపతి, హేమచందర్ తదితరులు పాల్గొన్నారు.